క్లుప్తంగా

లక్ష్మీనారసింహుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని లక్ష్మీనారసింహస్వామివారికి బుధవారం స్వాతి నక్షత్ర పూజలు నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు స్వహస్తాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పొంగళ్లుపొంగించి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

వలంటీర్‌కు ఎమ్మెల్యే ఆర్థికసాయం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో క్యాన్సర్‌తో బాధపడుతున్న అనారోగ్య బాధితురాలికి మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహాయాన్ని ప్రకటించి బుధవారం అందజేయించారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలోని 14వ సచివాలయ పరిధిలోని సీతానగరంలో వలంటీర్‌గా పనిచేస్తున్న పఠాన్ షాహిదా ఖతున్ క్యాన్సర్ వ్యాధితో పడుతూ చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని, ఆమె పరిస్థితిని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన వెంటనే రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించి అందజేశారని తెలిపారు. నాయకులు చిన్నపోతుల దుర్గారావు, బాలసాని అనీల్ పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంగళగిరి: రానున్న రెండు మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున నగర పరిధిలోని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ యు శారదాదేవి విజ్ఞప్తి చేశారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నగరంలో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగి పడే ప్రమాదం పొంచి ఉందని, అటువంటివి గుర్తిస్తే వెంటనే నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక కాల్ సెంటర్ 7093912653 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. మరీ ముఖ్యంగా విలీన గ్రామాల పరిధిలో చెరువులు, వాగులు కోతకు గురి అయ్యే ప్రమాదం ఉన్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని హెల్త్ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర సీజనల్ వ్యాధులకు సంబంధించి మందులు, టెస్టులు హెల్త్ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షాకాలంలో నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ కాచి వడపోసిన నీరు తాగాలని కమిషనర్ శారదాదేవి సూచించారు.

మణిపూర్ క్రైస్తవులకు భద్రత కల్పించాలి



తాడేపల్లిరూరల్: మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని నిలువరించాలని కోరుతూ బుధవారం కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి సెంటర్ వద్ద నుంచి తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ ప్రతినిధులు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిలువరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, గ్యాంగ్ రేప్‌లు చేసి చంపేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు ఎం.జాన్ డగ్లస్, ప్రెసిడెంట్ ఎస్.జోసఫ్, సెక్రటరీ సీహెచ్ డేవిడ్ గాంధీ, మెట్రో రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బి.రవిప్రకాష్, సీడబ్ల్యూపీఎఫ్ పి.సహదేవ్, ప్రజా నాట్యమండలి నాయకులు జగన్, కొట్టి కరుణాకర్, ఐద్వా నేతలు గిరిజ, ఉష తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కుటుంబాలకు బియ్యం, కూరగాయల పంపిణీ

తెనాలి: రూరల్ మండలం కొలకలూరు గ్రామం వెలుపల పశ్చిమడెల్టా కొమ్మమూరు కాల్వ కట్టపై నివసిస్తున్న ఎస్టీ కుటుంబాలకు సినీదర్శకుడు దిలీప్‌రాజా బుధవారం సాయంత్రం బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. గత కొద్దిరోజులుగా విడవకుండా కురుస్తున్న వర్షాలకు, వారంతా గుడిసెల్లోనే ఉండిపోయారని తెలిపారు. దీంతో ఆ కుటుంబాలకు రోజువారీ ఆహారానికి ఇబ్బంది రాకుండా ఉండాలని చిరుసాయం చేసినట్టు దిలీప్‌రాజా తెలిపారు.

మహనీయులకు ప్రనామం

- పార్కులకు, రోడ్లకు మహనీయుల పేర్లతో ఆర్చీలు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) నిర్ణయంతో హర్షం



మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవనరామ్ పేరుతో ఏర్పాటు చేసిన ఆర్చీ

మంగళగిరి: మంగళగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. దేశం కోసం త్యాగం చేసిన త్యాగధనులు, మహనీయులు, ప్రజాసేవకులు, దాతల పేర్లతో నామకరణాలు చేసి రోడ్లకు వారి పేర్లతో ఆర్చీలు నిర్మించారు. తొలి రోజులలో ఎమ్మెల్యేలుగా సేవలందించిన సీపీఐకి చెందిన వేములపల్లి శ్రీకృష్ణ, గోలి గోపాలరావు, వంగవీటి రంగా, దాసరి తమ్మిశెట్టి రామకృష్ణలతో పాటు పలువురు పేర్లను పార్కులకు పెట్టారు. ఎన్నో సంస్థలకు ఉదారంగా తన భూములనిచ్చిన కారుమంచి వెంకటసుబ్బయ్య చౌదరి పేరుతో నవులూరు సెంటర్‌లో ముఖద్వారం నిర్మించారు. అంతేకాకుండా ఇండోర్ స్విమ్మింగ్ పూల్‌కు మహబూబ్ షంషేర్ ఖాన్ మెమోరియల్ స్విమ్మింగ్ పూల్‌గాను, పవర్ లిఫ్టింగ్ స్టేడియానికి గుమ్మడి పుల్లేశ్వరరావు, సాదియా ఆల్మాస్ పేర్లతోను నిర్మాణం చేశారు. పాతబస్టాండ్ ఆవరణలో చేపట్టిన చేనేత భవనానికి ప్రగడ కోటయ్య, వైఎస్సార్ చేనేత భవనంగా ఎమ్మెల్యే ఆర్కే నామకరణం చేశారు.

మహనీయుల పేర్లు పెట్టడం అభినందనీయం..



భావితరాలకు మహనీయుల, త్యాగధనులు, ప్రజాసేవకులు గుర్తుండేలా పేర్లు పెట్టడం నిజంగా అభినందనీయం. ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి(ఆర్కే) వినూత్నంగా గతాన్ని తిరగరాసి సరికొత్త ప్రజాసేవకుడిగా నిలిచారు.

– వల్లభనేని వాణి, స్నేహ మహిళా మండలి

గ్రామమంతా తీర్మానించినా...



మాగ్రామానికి చిన్నరోడ్డు వుండేది. ఎమ్మెల్యే ఆర్కే దాన్ని 100 అడుగులు రోడ్డుగా విస్తరించి, సెంట్రల్ డివైడర్ ఏర్పాటు చేయడంతో ప్రధాన రహదారిగా అభివృద్ధి చెందుతుంది. రోడ్డు వేసిన ఎమ్మెల్యే ఆర్కే పేరు పెడతామని గ్రామమంతా తీర్మానించినా, ఎమ్మెల్యే అంగీకరించకుండా మహాత్మా జ్యోతిరావు పూలే, వైఎస్సార్‌ల నామకరణాలు చేయడంతో పాటు వారి విగ్రహాలను ఏర్పాటు చేసి ఆర్చి ఏర్పాటు చేశారు.

– బొమ్ము శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్, ఆత్మకూరు

భావితరాలు మరువకూడదనే..



త్యాగధనులు, మహనీయులు, ప్రజాసేవకులను భావితరాలు మర్చిపోకూడదనే వారి పేర్లను రోడ్లకు, భవనాలకు పెట్టడం జరిగింది. దేశం కోసం ఎంతో సేవ చేసిన నేతలతో పాటు మంగళగిరి అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించిన వారి పేర్లు, చరిత్ర నేటితరం అదేవిధంగా భావితరం మరువకూడదనే ఉద్దేశ్యంతో వారి పేర్లు పెట్టడం జరిగింది.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్యే

ఎడతెరిపిలేని వర్షంతో తిప్పలు

మునిగిన పొలాలు, శివారు కాలనీలు



రత్నాల చెరువు శివారు కాలనీ సూర్యనారాయణ నగర్ ఎస్టీకాలనీలో ఇళ్లల్లోకి చేరిన వర్షం నీరు

మంగళగిరి: నగరాన్ని బుధవారం వర్షం ముంచెత్తింది. మంగళవారం రాత్రి ప్రారంభమైన వర్షం జోరుగా కురుస్తూనే ఉంది. వర్షం ధాటికి రోడ్లు జలమయం కాగా కాజ, చినకాకాని, పెదవడ్లపూడి, నూతక్కి, యర్రబాలెం, నవులూరు, నిడమర్రు పొలాలన్నీ జలమయమయ్యాయి. వర్షం ధాటికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వర్షం తెరిపి లేకుండా కురవడంతో జనాలు ఇళ్లకే పరిమితమయ్యారు. నాట్లు వేసిన వరి పొలాలన్నీ మునిగిపోయాయి. చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని శివారు కాలనీలైన సూర్యనారాయణ నగర్, ఎస్టీ కాలనీలోని ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది. అధికారులు ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారిని ప్రత్యేక శిబిరాలకు తరలించి వసతి ఏర్పాట్లు చేశారు. భార్గవపేట, మెయిన్ రోడ్, గౌతమ బుద్దా రోడ్ వెంబడి మురుగు కాలువలు పొంగి రోడ్డుపైకి చేరింది.

తాడేపల్లిలో...

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో వర్షాల ప్రభావంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అధికారులు వెంటనే స్పందించి ఆ వర్షపు నీటిని బయటకు పంపేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గత నెల రోజుల క్రితం నుంచి తాడేపల్లి పట్టణ పరిధిలోని పూడుకుపోయిన డ్రైనేజీలను, కల్వర్టులలో ఉన్న చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ కవర్ల పూడిక తీత పనులు చేయించడం, పట్టణ శివారు ప్రాంతాల్లో వున్న ఔట్‌ఫాల్ డ్రైన్లు పునరుద్ధరించడంతో తాడేపల్లి పట్టణ ప్రాంతాల్లో వర్షపు నీరు సులువుగా బయటకు వెళ్లింది. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీల కన్నా తక్కువ ఎత్తులో రోడ్లు ఉండడంతో ఆ రహదారుల్లో వర్షపు నీరు నిలిచింది. అలాగే గతంలో లోతట్టు ప్రాంతాలైన జగజ్జీవన్ రామ్ కాలనీ, తెల్ల క్వారీ, ఎర్ర క్వారీల్లో ఇళ్లు నిర్మించుకున్న చోట స్వల్పంగా నీరు నిలవడంతో కార్పొరేషన్ అధికారులు మోటార్ల ద్వారా నీటిని బయటకు పంపిస్తున్నారు. డీఈ కృష్ణారెడ్డి లోతట్టు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. చిర్రావూరు, వడ్డేశ్వరం, గుండిమెడ, ప్రాతూరు, మెల్లెంపూడి, కొలనుకొండ, ఇప్పటం తదితర ప్రాంతాల్లో ముందస్తుగా ఔట్ పాల్ డ్రైనేజీలను పునరుద్ధరించడంతో 90శాతం వర్షపునీరు బయటకు పోయింది. చిర్రావూరు, నూతక్కి మెయిన్ రోడ్‌లో ఔట్‌ఫాల్ డ్రైనేజీ లేక వర్షపు నీరు నిలబడింది. నివాసాల మధ్య వర్షపు నీరు లేకుండా అధికారులు, సచివాలయ సిబ్బంది జాగ్రత్తలు తీసుకున్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి ఆదేశాల మేరకు తాడేపల్లి పట్టణ రూరల్ ప్రాంతాల్లో డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, ఏఈలు కిషోర్, ప్రవీణ్, సచివాలయ సిబ్బంది పర్యటించారు.



పెరికలపూడిలో డ్రైనేజీకి సమాంతరంగా నీరు నిల్వ ఉన్న పంటపొలాలు



ఉండవల్లి సెంటర్‌లో రోడ్ పల్లంగా ఉండడంతో నిలిచిపోయిన వర్షపు నీరు

నీటమునిగిన కాలనీ.. యుద్ధప్రాతిపదికన చర్యలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని వైఎస్సార్ కాలనీలో వర్షపు నీరు చేరి రోడ్లన్నీ జలమయమై బుధవారం ఇళ్లలోకి చేరాయి. సమాచారం అందుకున్న రేవేంద్రపాడు సర్పంచి పలుకూరి మేరమ్మ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.



వైఎస్సార్ కాలనీలో రోడ్లపై వున్న వర్షపు నీరు

వెంటనే పొక్లెయిన్ తెప్పించి పంట పొలాల్లో వున్న డ్రైనేజీలో వున్న చెత్తా చెదారాన్ని తొలిగింపజేశారు.

దుగ్గిరాలలో...

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలో విస్తారంగా వర్షాలు కురవడంతో పంట పొలాల్లో భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. బుధవారం దుగ్గిరాల మండల వ్యాప్తంగా 78 మి.మీ.ల వర్షపాతం నమోదు అయ్యింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు ఒక్క రోజే పడడంతో పంటపొలాల్లో భారీగా వర్షపు నీరు చేరింది. పంట పొలాల్లో వున్న డ్రైనేజీల్లో చెత్తా చెదారం వేయడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయింది. మెట్ట భూముల్లో నీరు ఇంకిపోతున్నప్పటికీ మాగాణి భూముల్లో వర్షపునీరు అలాగే నిలిచిపోయింది.

వర్షం నీరు మళ్లింపు..

తాడికొండ: తాడికొండ శివారు బడేపురం గ్రామంలోని జగనన్న కాలనీలో వర్షపు నీటి మళ్లింపునకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు నిలిచి నివాసాల వారికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పొక్లెయిన్ సాయంతో మురుగునీటి మళ్లింపు ప్రక్రియ చేపట్టినట్లు కార్యదర్శి పి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

తాడికొండ, తుళ్లూరు మండలాల్లో...

తాడికొండ: అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లాయి. తాడికొండ, తుళ్లూరు మండలాల్లో వాగులు వంకలు పొంగి పొర్లడంతో పంట పొలాలు నీటమునిగాయి. తుళ్లూరు మండలం పెదపరిమి వద్ద కోటేళ్ళ వాగుకు వరద నీరు పోటెత్తడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లాం వద్ద కొండవీటి వాగుకు వరద ప్రవాహ ఉధృతి పెరగడంతో చప్టాకు ఆనుకొని వరద నీరు ప్రవహిస్తుంది. పంట పొలాలను వరద నీరు ముంచెత్తడంతో తాడికొండ, లాం, పలు గ్రామాల్లో పొలాల్లో నీరు నిలిచి పత్తి, జూట్, అపరాల పంటలు నానుతున్నాయి. ప్రస్తుతానికి పంట పొలాలకు పెద్దగా ఇబ్బందేమీ లేనప్పటికీ వరద ఉధృతి మరింతగా పెరిగితే మాత్రం పొలాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు రైతులు చెబుతున్నారు.



లాం వద్ద నీటమునిగిన నువ్వుల పంట

అందరికీ న్యాయవ్యవస్థ గురించి తెలియాలి

- సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళేశ్వరి
- కిట్స్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జ్ చంద్రమౌళేశ్వరి తదితరులు

గుంటూరు రూరల్: సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయవ్యవస్థ గురించి తెలియజేయాలని న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించటం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జి.చంద్రమౌళేశ్వరి తెలిపారు. బుధవారం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోని కిట్స్ కళాశాలలో విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జ్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో ప్రధానమైన భాగంగా పరిగణించబడతారన్నారు. ప్రధాన భాగమైన విద్యార్థులు తెలిసి తెలియక కొంతమంది అపరాధాలు చేసి వారి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులకు లోక్ అదాలత్, భారతీయ చట్టాలను వివరించారు. పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ పీవీ రాంబాబు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు చేసే అపరాధాలు వాటికి చట్టపరంగా పడే శిక్షలు వివరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ప్రజలకు ఏవిధంగా చట్టాలు సహాయం అందిస్తున్నాయో తెలిపారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలని వాళ్ళ జీవితాలను క్షణకాలంలో చేసే ఆలోచనల మూలంగా జీవితాలు ఏవిధంగా నాశనమవుతున్నాయి వివరించారు. ర్యాగింగ్ తదితర అపరాధాలు చేసి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పీ బాబు, డైరెక్టర్ కె.హరిబాబు, కె.చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు



సబ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు

ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తత చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఫ్యామిలీ హెల్త్ వెల్‌నెస్ ప్రోగ్రాం కింద గ్రామాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఫరీనాబేగంను వివరాలు అడిగారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలోని మందులు, ఓపీ వివరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలోని హాలులో ఆరోగ్యసిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎన్‌సీడీసీడీ, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, బర్త్ ప్లానింగ్ వంటివాటి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులు వివరించారు. ప్రతినెలా ఇటువంటి సమావేశాలు నిర్వహిస్తామని, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి రత్నమన్‌మోహన్, వైద్యాధికారులు ఫరీనాబేగం, యానీగ్రేస్, ఎస్తేరురాణి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణంతో మెరుగైన సేవలు..

ఫిరంగిపురం: నూతన పీహెచ్‌సీ భవన నిర్మాణంతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వెనుక భాగంలోని స్థలాన్ని బుధవారం అధికారులతో కలిసి ఎ.శ్రావణ్‌బాబు పరిశీలించారు. అనంతరం ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ మాట్లాడుతూ పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు. ఆయన వెంట జిల్లా ఉప వైద్యాఆరోగ్యశాఖాధికారి రత్నమన్‌మోహన్ ఉన్నారు.

'అంజుమన్' ఎన్నికల్లో ఇస్లామిక్ ఫ్రంట్ ఘనవిజయం

తొమ్మిది స్థానాలకు గానూ ఏడు స్థానాల్లో గెలుపు



ఇస్లామిక్ ఫ్రంట్ కన్వీనర్ షేక్ అక్రమ్

మంగళగిరి: అంజుమన్ ట్రస్ట్‌బోర్డు ఎన్నికల్లో ఇస్లామిక్ ఫ్రంట్ ఘన విజయం సాధించింది. మొత్తం తొమ్మిది స్థానాలకు గానూ ఏడు స్థానాల్లో ఇస్లామిక్ ఫ్రంట్ అభ్యర్థులు గెలుపొందగా మరో రెండు స్థానాల్లో ఇటీవల నూతనంగా ఆవిర్భవించిన ముస్లిం యువసేన అభ్యర్థులు గెలుపొందారు. నగరంలోని సీకే జూనియర్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం రాత్రి అంజుమన్ ట్రస్ట్‌బోర్డు ఎన్నికల కౌంటింగ్ నిర్వహించారు. పటిష్ట పోలీస్ బందోబస్తు నడుమ కౌంటింగ్ ప్రక్రియ మొదలైంది. ఓ పక్క వర్షం కురుస్తూనే ఉన్నా మరో పక్క కౌంటింగ్ హాల్లో ఉత్కంఠ కొనసాగుతూనే వచ్చింది. ఎన్నికల బరిలో ముస్లిం యువతరం, ముస్లిం ఫ్రంట్, ఇస్లామిక్ ఫ్రంట్, ముస్లిం యువసేన నిలవగా ఇస్లామిక్ ఫ్రంట్ ఘన విజయం సాధించింది. ఈనెల 23వ తేదీన అంజుమన్ ట్రస్టు బోర్డు ఎన్నికలు నిర్వహించారు. ఇస్లామిక్ ఫ్రంట్ తరఫున బరిలో నిలిచిన ఏడుగురు అభ్యర్థులు విజయం సాధించగా ముస్లిం యువసేన నుంచి ఇద్దరు అభ్యర్థులు విజయం సాధించారు. ఇస్లామిక్ ఫ్రంట్ నుంచి షేక్ అక్బర్ బాషా, షేక్ అబ్దుల్ సలీమ్, షేక్ యాసిన్, షేక్ అలీ, షేక్ అబ్దుల్ సలీమ్, షేక్ హనీఫ్ షా ఖాదరీ, షేక్ హఫీజ్ (బద్రి)లు విజయం సాధించారు. ముస్లిం యువసేన నుంచి షేక్ అక్రమ్, షేక్ అబుజలి విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి అస్గర్ అలీ తెలిపారు. ఎన్నికల అనంతరం విజయం సాధించిన ఇస్లామిక్ ఫ్రంట్ కన్వీనర్ షేక్ అక్రమ్ ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

ప్రగడ కోటయ్య సేవలు చిరస్మరణీయం



ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం చేనేత సూర్యుడు ప్రగడ కోటయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కొనియాడారు. బుధవారం నగరంలోని ఆటోనగర్ ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య 108వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ చేనేత రంగంలోని సమస్యల పరిష్కారం కోసం ప్రగడ కోటయ్య తన జీవితాన్ని దారబోసారని కొనియాడారు. చేనేత సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమ వాణిని వినిపించి చేనేత సొసైటీల ఏర్పాటుకు విశేష కృషి చేశారన్నారు. అనంతరం కార్గిల్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మి, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్, పారేపల్లి మహేష్, రజక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, మల్లవరపు సుధారాణి, గుంటి విజయలక్ష్మి, గుత్తికొండ రామకృష్ణారెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో...

మంగళగిరి: నగరంలోని పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో చేనేత ముద్దుబిడ్డ, రాజ్యసభ మాజీ సభ్యుడు ప్రగడ కోటయ్య 108వ జయంతి వేడుకలు బుధవారం సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలు హాజరై ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వీవర్స్ కాలనీలోని దామర్ల రమాకాంతరావు, ప్రగడ కోటయ్య ఉన్నత పాఠశాలలో విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలీయ బహూత్తమ సంఘం నాయకులు దామర్ల కుబేరస్వామి, గంజి రవీంద్ర, రామనాథం పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

• యువకుడి మృతదేహం లభ్యం

పెదనందిపాడు: నల్లమడ వాగులో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ కథనం ప్రకారం మండల పరిధిలోని నాగులపాగు గ్రామ సమీపంలో నల్లమడ వాగు వద్ద గుర్తు తెలియని 45 సంవత్సరాల యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారి సమాచారం పోలీసులు వాగులో ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి కుడిచేతిపై జి నరసమ్మ అనే పేరు పచ్చబొట్టు ఉన్నదని, వివరాలు తెలిసిన పెదనందిపాడు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.